క్లుప్తంగా

మద్ది క్షేత్రంలో అభివృద్ధి పనులకు భూమి పూజ



క్షేత్రంలో అభివృద్ధి పనులకుగాను భూమి పూజ నిర్వహించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామివారి క్షేత్రంలో శనివారం శ్రీరామ సదనం యాత్రికుల విశ్రాంతి భవనం, వ్యాపార సముదాయ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆలయ చైర్మన్ కీసరి సరిత, ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ గుబ్బల సత్యవేణి, ఎంపీటీసీ కొయ్య రమారెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొని కొబ్బరి కాయలు కొట్టి అభివృద్ధి పనుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆలయ చైర్మన్ సరిత మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం రూ.కోటి 20 లక్షలతో యాత్రికుల విశ్రాంతి భవనాన్ని నిర్మించేందుకు శంకుస్థాపన చేశామన్నారు. ఈవో ఆకుల కొండలరావు, ధర్మకర్తలు దండు వెంకట కృష్ణంరాజు, మల్నీడి బాబి, బ్రహ్మానందరావు, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం ఎస్సై సాగర్‌బాబు బదిలీ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఎస్సై ఎం.సాగర్‌బాబు బదిలీ అయ్యారు. కాగా జంగారెడ్డిగూడెం ఎస్సైగా ఆర్.మల్లిఖార్జునరెడ్డి నియమితులయ్యారు. ఈయన వీఆర్ నుంచి ఇక్కడికి బదిలీ కాగా, సాగరబాబు వీఆర్‌కు వెళ్లారు.

చంద్రబాబు పాపం పండింది

- పక్కా ప్లాన్‌తోనే స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్
- జంగారెడ్డిగూడెంలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం: ఎట్టకేలకు టీడీపీ అధినేత చంద్రబాబు పాపం పండిందని... ఇది అంతం కాదని... ఆరంభం మాత్రమేనని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు విషయంలో ఆయన చేసిన స్కామ్‌లు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చాక స్కిల్ డెవలప్‌మెంట్ స్కీమ్‌తో భారీ స్కామ్‌కు పాల్పడ్డారని పేర్కొన్నారు. ప్రభుత్వం సొమ్ము కాజేసేందుకు పక్కాగా ప్లాన్ రూపొందించారన్నారు. అన్ని ఆధారాలతో చంద్రబాబును దోషిగా గుర్తించి సీఐడీ అరెస్టు చేసినట్లు తెలిపారు. గత నాలుగు రోజులుగా చంద్రబాబు తనను అరెస్టు చేస్తారని, ప్రచారం చేసుకుంటూ దానికి కార్యకర్తలు అడ్డుపడాలని ప్రసంగాల్లో చెప్పారని పేర్కొన్నారు. చంద్రబాబు తెలంగాణాలో ఓటుకు నోటు కేసులో బుక్కయ్యారని, ఇంత వరకు ఆ గొంతు తనది కాదని చెప్పడం లేదని, కాని తన ఫోన్ ట్యాపింగ్ చేశారని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. దీనిని బట్టి చంద్రబాబు తనను దొంగ అని చెప్పడానికి వీల్లేదని అనడం విడ్డూరంగా ఉందన్నారు. నూరు గొడ్డులు తిన్న రాబందు ఒకే గాలి వానకు నేల ఒరిగిందన్న చందంగా చంద్రబాబు పాపం పండిందన్నారు. చంద్రబాబు, నారా లోకేశ్ ఎక్కడికి వెళితే అక్కడ ఆ ప్రాంత ఎమ్మెల్యేలను దొంగలంటారని, ఇదంతా చూస్తుంటే దొంగే దొంగ అన్నట్లుగా ఉందన్నారు. ప్రజలకు అన్ని విషయాలు అర్థమవుతున్నాయని, సైకో ఎవరో కూడా తెలుసుకుంటున్నారని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వ ధనం దోచుకున్న చంద్రబాబు ఇప్పటికైనా జైల్లో విశ్రాంతి తీసుకోవాలని ఎమ్మెల్యే ఎలీజా హితవు పలికారు. స్కిల్ స్కామ్‌ను ధైర్యంగా వెలికితీసిన అధికారులను ఆయన అభినందించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పోల్నాటి బాబ్జి, జిల్లా మహిళా అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ, మండల కమిటీ అధ్యక్షుడు పానుశెట్టి హరిబాబు, వందనపు వెంకటేశ్వరరావు, బత్తిన చిన్న, చలమల శ్రీనివాసరావు, వెంప హైటెక్, గూడపాటి రాధాకృష్ణ, గెద్దాడ శ్రీనివాసరావు, ఉగ్గం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చట్టం ముందు అందరూ సమానమే

- ప్రజల సొమ్ము కాజేసినందుకే చంద్రబాబు అరెస్టు
- ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: చట్టం ముందు అందరూ సమానమేనని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని దుద్దుకూరులో శనివారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవహారంలో చట్టం తన పని తాను చేసుకుంటూ వెళ్తుందని అన్నారు. దీనిలో రాజకీయ దురుద్దేశం ఏమీలేదని స్పష్టం చేశారు. చంద్రబాబు అరెస్ట్ పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఎక్కడా కూడా ప్రతీకార చర్యలు, కక్ష సాధింపు చేయాలనే ఆలోచన ఎన్నడూ చేయలేదని, అటువంటి ఆలోచనే ఉంటే చంద్రబాబును ఎప్పుడో అరెస్ట్ చేయవచ్చని అన్నారు. నూరు ఆంబోతులను తిన్న రాబందు ఒక్క గాలి తుఫానుకు కొట్టుకుపోతుందనే చందంగా నూరు పాపాలు, నేరాలు చేసిన వ్యక్తి ఏ రోజుకైనా దొరుకుతాడనడానికి నిదర్శనం స్కిల్ డెవలప్‌మెంట్ స్కామేనని అన్నారు. యువత పేరుతో లూటీ చేసిన అతిపెద్ద కుంభకోణమని, పిల్లలకు చేసిన పాపమే ఈ రోజు చంద్రబాబుకి తగిలిందని అన్నారు. ఇలాంటి పాపాలు చంద్రబాబు ఎన్నో చేశారని అన్నారు. ఎన్నో నేరాలు, ఘోరాలు చేసినా వ్యవస్థను అడ్డుపెట్టుకుని ఇన్నాళ్లూ నిప్పు, తుప్పు అంటూ చంద్రబాబు తిరిగారని విమర్శించారు. ఇన్నాళ్లూ చంద్రబాబుకున్న పలుబడితో కోర్టుల నుంచి స్టేలు తెచ్చుకుంటూ మేకపోతు గంభీరం ప్రదర్శిస్తూ వచ్చారని, అయితే ఇప్పుడు జరుగుతుంది దేవుడు రాసిన స్క్రిప్ట్ అని పేర్కొన్నారు. ఈ స్కామ్ నుంచి చంద్రబాబు బయట పడటం కష్టమేనని, నూటికి నూరు శాతం శిక్ష అనుభవించి తీరాల్సిందేనని అన్నారు. చంద్రబాబు అరెస్ట్ సరైందేనని బాలరాజు పేర్కొన్నారు. ఇంకా అనేక నేరాలు, ఘోరాలు బయట పడబోతున్నాయని, చంద్రబాబుకు 40 సంవత్సరాల అనుభవం, 14 సంవత్సరాల ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఆయన చేసిన ప్రతి ఒక్క స్కామ్ ఒకొక్కటిగా బయటకు వస్తూనే ఉంటాయని అన్నారు. ఇది జస్ట్ ట్రైలర్ మాత్రమేనని, ముందుంది ముసళ్ల పండుగని అన్నారు. చంద్రబాబు తన అరెస్ట్ రాజకీయంగా మార్చుకుని కార్యకర్తలను, నాయకులను ఉసుగొల్పుతూ రాష్ట్రంలో అల్లర్లు సృష్టిస్తున్నారని, రాష్ట్రంలో ఏం జరిగినా అందుకు చంద్రబాబే కారణమని బాలరాజు అన్నారు.

చంద్రబాబు శిక్ష అనుభవించక తప్పదు

లింగపాలెం: టీడీపీ అధినేత నారా చంద్రబాబు చేసిన తప్పులకు శిక్ష అనుభవించక తప్పదని రాష్ట్ర లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ అన్నారు. శనివారం ధర్మాజీగూడెంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు శిక్షకు రాజకీయ అనుభవంతో పనిలేదన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి పేరుతో కోట్లలో లూటీ చేసి డాక్యుమెంట్లు మాయం చేసిన చంద్రబాబును అరెస్ట్ చేయడంలో తప్పులేదన్నారు. స్కిల్ స్కాంలో ప్రధాన ముద్దాయి ఎ1 చంద్రబాబు అరెస్ట్‌లో ఎలాంటి దురుద్దేశాలు లేవని, బలమైన ఆధారాలతోనే సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారన్నారు. ఇది రాత్రికి రాత్రి జరిగింది కాదని దాదాపు రెండేళ్ల కిందటే ఎఫ్ఐఆర్ నమోదైందన్నారు. డబ్బు ఎటునుంచి ఎటు వెళ్లిందనేది తేలడానికి ఇంత సమయం పట్టిందని రూ.371 కోట్లు దారి మళ్లింపుపై ప్రధాన సూత్రదారి, బెనిఫిషియరీ కూడా చంద్రబాబే అని తేలడంతో అరెస్ట్ చేయటం జరిగిందన్నారు.

ఎద్దువాగును పరిశీలించిన ఆర్డీవో

వేలేరుపాడు: గత మూడు రోజులుగా ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాల కారణంగా పెరిగిన గోదావరి వరదతో వేలేరుపాడు మండలంలోని ఎడవల్లి, కట్కూర్ గ్రామాలలో నీటమునిగిన ఎద్దువాగు బ్రిడ్జిని శనివారం జంగారెడ్డిగూడెం ఆర్డీఓ డా.ఝాన్సీరాణి, తహసీల్దార్ జి ఎలీషాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ భద్రాచలం వద్ద పెరిగిన వరద ప్రవాహంతో ఎద్దువాగు బ్రిడ్జి నాలుగు అడుగుల మేర నీటమునిగిందని దీంతో రాకపోకలు నిలిచిపోయాయన్నారు. ప్రస్తుతం వరద ప్రవాహం కొంతమేర తగ్గినా రాకపోకలకు అనువుగా లేదన్నారు. అత్యవసర పరిస్థితులలో ప్రజలు రాకపోకలు సాగించేందుకు మోటార్ బోట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు రెండు షిఫ్టులలో విధులు నిర్వహించుటకు రెవెన్యూ, సచివాలయ సిబ్బందిని నియమిస్తూ ఆదేశాలు జారీచేశామన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 500 కేసుల పరిష్కారం



చింతలపూడి : న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు



జంగారెడ్డిగూడెం : జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి: చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 500 కేసులు పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. వాటిలో 472 క్రిమినల్ కేసులు, 8 సివిల్ కేసులు, 3 కుటుంబ తగాదా కేసులు, 3 చెక్ బౌన్స్ కేసులు, 7 బ్యాంక్ కేసులు, 5 టెలిఫోన్ బకాయి కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. లోక్‌అదాలత్ వల్ల కలిగే ఉపయోగాలను సదస్సులో వివరించారు. రాజీ పడటం ద్వారా ఇరుపక్షాలు గెలిచినట్లేనని చెప్పారు. కోర్టుకు కట్టిన ఫీజులు కూడా తిరిగి పొందే అవకాశం లోక్‌అదాలత్‌లో ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీ వి.సామయ్య, అడ్వకేట్ మెంబర్ మాణిక్యాలరావు, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ ఆలి, న్యాయవాదులు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో...

జంగారెడ్డిగూడెం: లోక్ అదాలత్‌లో 887 కేసులు పరిష్కారమైనట్లు జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్ కుమార్, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కేఎస్ఆర్ తేజస్వి తెలిపారు. శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో మనోవర్తి కేసులు 6, గృహ హింస కేసులు 2, చెక్‌బౌన్స్ కేసులు 7, ఫ్యాక్టరీ యాక్ట్ కేసు 1, సివిల్ కేసులు 15, బీఎస్ఎన్ఎల్ కేసులు 7, బెంచ్ కోర్టు కేసులు 785 మొత్తం 887 కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో బెంచ్ సభ్యులు ఏవీవీ భువనేశ్వరి, టి.శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపట్టి పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి తెలిపారు. స్థానిక 9వ వార్డులో పేరంపేట రోడ్డులో గల కారం మిల్లు సమీపంలో రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు డ్రెయిన్ నిర్మాణ పనులను శనివారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముప్పిడి సంగి, స్థానిక కౌన్సిలర్ సంకు సురేష్, బత్తిన చిన్న పాల్గొన్నారు.

జ్వరంతో చిన్నారి మృతి



నక్కా నాగ దిష్మిత(ఫైల్)

కుక్కునూరు: జ్వరంతో బాధపడుతూ చిన్నారి మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని కివ్వాక గ్రామంలో జరిగింది. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం కివ్వాక గ్రామానికి చెందిన నాగదిష్మిత(7)కు వారం రోజుల క్రితం తీవ్రస్థాయిలో జ్వరం వచ్చింది. స్థానికంగా చికిత్స అందించినా జ్వరం తగ్గకపోవడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు భద్రాచలం ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చిన్నారికి వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగీ ఎన్ఎస్‌గా నిర్ధారించారు. చికిత్స అందించే సమయానికి రక్తకణాల సంఖ్య పడిపోవడం జ్వరం తీవ్రమవ్వడంతో చిన్నారిని విజయవాడ రెయిన్‌బో ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడికి తీసుకెళ్లేసరికే చిన్నారి మృతి చెందింది. చిన్నారి మృతితో కివ్వాక గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. నిన్న, మొన్నటి వరకు కళ్ల ముందు ఆడుతూ, పాడుతూ తిరిగిన చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు.

శ్రీనివాసుని దివ్య పవిత్రోత్సవాలు ప్రారంభం



శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామి

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీనివాసుని దివ్య పవిత్రోత్సవాలు శనివారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛరణల నడుమ యాగశాలలో అంకురార్పణ కార్యక్రమాన్ని జరిపి, ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ముందుగా అర్చకులు ఆలయ ఆవరణలోకి పుట్టమన్నును తెచ్చి సిద్ధంగా ఉంచిన పాలికల్లో దానిని పోశారు. ఆ తరువాత మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ నవధాన్యాలను పాలికల్లో ఉంచారు. దాంతో అంకురార్పణ కార్యక్రమం ముగిసింది. ఆలయంలో ఏడాది పొడవున తెలిసీ, తెలియక జరిగిన తప్పుల ప్రాయఃశ్చిత్తం నిమిత్తం ఈ పవిత్రోత్సవాలను నిర్వహించడం ఇక్కడ సంప్రదాయ బద్ధమైంది. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పవిత్రాధివాసం, సోమవారం పవిత్రారోహణ కార్యక్రమాలు జరుగుతాయని, మంగళవారం జరిగే పవిత్రావరోహణ, మహా పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయని ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు తెలిపారు.

చీరలు, పంచెల ఆదాయం రూ.32 వేలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన వస్త్రాలు, చీరలకు శనివారం వేలం వేశారు. 78 చీరలు, 41 పంచెలను వేలం వేయగా రూ.32,815 ఆదాయం వచ్చింది. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ట్రస్టీలు కూరాళ్ల రమాదేవి తదితరులు వేలం నిర్వహించగా, కార్యక్రమాన్ని కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసి రావు పర్యవేక్షించారు.

ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలపాలి



చింతలపూడిలో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చింతలపూడి: ఈ నెల 18న జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎంఎస్‌పీ ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త, ఎమ్మార్పీస్ జాతీయ నాయకురాలు చవటపల్లి విజయ మాదిగ విజ్ఞప్తి చేశారు. స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి 59 ఉప కులాలకు న్యాయం చేయాలని విజయమాదిగ కోరారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు వర్గీకరణకు మద్దతు తెలపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎంఎస్‌పీ కన్వీనర్ కె.హైమావతి, జోసెఫ్ తంబి, సొంగా నక్షత్రం మాదిగ, ఎస్.లక్ష్మీ మాదిగ, నాగార్జున, గొల్లపల్లి సౌజన్య, సీహెచ్ అరుణశ్రీ, జుజ్జువరపు మేరి మాదిగ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

గుండేటి వాగును పరిశీలించిన ఆర్డీఓ



గుండేటివాగుని పరిశీలిస్తున్న ఆర్డీఓ ఝాన్సీరాణి

కుక్కునూరు: గోదావరి వరదతో ముంపునకు గురైన గుండేటివాగు వంతెనను శనివారం ఆర్డీఓ డా.ఝాన్సీరాణి, తహసీల్దార్ ప్రమద్వరతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కుక్కునూరు గ్రామం నుంచి దాచారం వరకు వెళ్లే గుండేటివాగు వంతెన మార్గం భద్రాచలం వద్ద 30 అడుగుల మేర వరద ప్రవాహం ఉన్న సమయంలో ముంపునకు గురైనట్లు చెప్పారు. ఆ సమయంలో గుండేటివాగు వంతెనపై మూడు అడుగుల మేర వరద ప్రవాహం ఉందన్నారు. కాగా వంతెన నీటమునిగిన సమయంలో దాచారం వెళ్లేందుకు ఆర్అండ్‌బీ రహదారి గుండా మరోమార్గం ఉందన్నారు. ఆ వంతెన మీదుగా రాకపోకలు సాగించకుండా ఉండేందుకు వీఆర్ఏలకు డ్యూటీ వేశామన్నారు. ప్రస్తుతానికి నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టిందని చెప్పారు.

అలరించిన 'పాడనా తీయగా'

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో సంగీత దర్శకుడు ఎస్‌పీఎస్ వాసు శనివారం నిర్వహించిన పాడనా తీయగా కార్యక్రమం ప్రేక్షకులను అలరించింది. ఔత్సాహిక గాయనీ గాయకులను ప్రోత్సహించేందుకు, వారికి టీవీలు, సినిమాల్లో అవకాశం కల్పించే నిమిత్తం శనివారం రాత్రి స్థానిక వైఎంహెచ్ఏ హాలులో పాడనా తీయగా కార్యక్రమం నిర్వహించారు. సంగీత దర్శకుడు వాసు బృందం సంగీత సహకారం అందించగా ఎంపిక చేసిన సుమారు 15 మంది గాయకులు తమ ప్రతిభ ప్రదర్శించారు. వివిధ చిత్రాల్లోని జనరంజక పాటలు శ్రావ్యంగా ఆలపించారు. తొలుత ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ యువతీ, యువకులు వివిధ రంగాల్లో ఎంతో ప్రతిభ చూపుతున్నారని, వారికి సరైన అవకాశాలు కల్పించి వారి అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

ఎస్ఈబీ అధికారుల దాడులు



దాడుల్లో పట్టుకున్న నాటు సారా, పాత్రలతో అధికారులు

చింతలపూడి: చింతలపూడి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో నాగిరెడ్డిగూడెం గ్రామంలో ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. దాడుల్లో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ సాయి స్వరూప్ తెలిపారు. నిందితునికి బెల్లం సరఫరా చేసిన వ్యాపారిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

16 మందిపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ స్థానిక గరుడాళ్వార్ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టి.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించిన 16 మంది టీడీపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిపై కేసు నమోదు చేశారు. ఎస్సై సుధీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

31 మంది అరెస్ట్

జంగారెడ్డిగూడెం: చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ పలు కూడళ్లలో ఆందోళన చేస్తున్న 31 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ పి.రాజేష్, ఎస్సై సాగర్‌బాబు తమ సిబ్బందితో పటిష్టమైన చర్యలు తీసుకున్నారు. ఉదయం నుంచి ఆర్టీసీ బస్సులు నిలిపివేయగా ఆందోళనకారులందరినీ అదుపులోకి తీసుకున్నాక ఆర్టీసీ బస్సులు యథాతదంగా నడిపారు.

పటిష్ట బందోబస్తు

కుక్కునూరు: చంద్రబాబును అరెస్ట్ నేపథ్యంలో మండల వ్యాప్తంగా ఎటువంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా శనివారం పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ప్రధాన్ సెంటర్‌లలో పోలీసులు మోహరించారు. నల్ల జెండాలతో నిరసన తెలిపేందుకు రోడ్లమీదకు చేరుకున్న 21 మంది టీడీపీ కార్యకర్తలను సీఐ సత్యనారాయణ అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.